## నిధుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: బీఆర్ఎస్ అధికారంలో లేనప్పటికీ నియోజకవర్గానికి రావాల్సిన నిధుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గురువారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. చట్టబద్ధంగా నియోజకవర్గానికి రావాల్సిన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అన్ని వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. అలాగే, దేశంలోనే వరి ధాన్యంలో తెలంగాణ మొదటి స్థానంలోకి వచ్చిందన్నారు. కల్లబొల్లి హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో ఏం చేసిందని ప్రశ్నించారు. పాలన నచ్చడం లేదని త్వరలోనే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని అన్నారు. ఈ నెల 13న చేవెళ్లలో జరిగే కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, జెటావత్ శ్రీనునాయక్, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అర్కల భూపాల్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

# సామూహిక ప్రార్థనలు.. శుభాకాంక్షలు

- ఆనందోత్సాహాలతో ఈద్–ఉల్–ఫితర్
- వేడుకల్లో పాల్గొన్న రాజకీయ నాయకులు



ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు



సరూర్‌నగర్ ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ /మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీద్‌ల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.ఎల్‌బీనర్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, వనస్థలిపురం, చైతన్యపురి ప్రాంతాలకు చెందిన ముస్లింలు సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్ తదితరులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- మలక్‌పేట జోన్ పరిధిలోని.. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, సైదాబాద్, అజంపురా, మూసారంబాగ్, కుర్మగూడ, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్ తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.



ఆర్‌కేపురంలో.. టీడీపీ మైనార్టీ విభాగం అధ్యకుడు ఎండీ జహంగీర్ నివాసంలో వేడుకల్లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ తదితరులు



పాల్గొన్న బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు

## బాబా ఆలయంలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యశోదా ఆసుపత్రి సౌజన్యంతో సంస్థాన్ ట్రస్ట్ మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య ప్రారంభించారు. వైద్యబృందం బీపీ, మధుమేహం, 2డీ ఎకో, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారని, సుమారు 200 మంది ఈ సేవలను వినియోగించుకున్నారని చైర్మన్ తెలిపారు. ట్రస్ ఉపాధ్యక్షుడు వి.శ్యాంకుమార్, సహాయ కార్యదర్శి శ్యామలరావు, సంస్థాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చైతన్యపురిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు

చైతన్యపురి: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. సైన్స్ యూనివర్స్ (స్పిరిచ్యువల్) ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో చైతన్యపురిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైతన్యపురి డీఐ గురుస్వామితో కలిసి ప్రారంభించారు. ఆధ్యాత్మిక విశ్వగురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో ప్రతి వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో వెంకటస్వామి, నర్సింహారెడ్డి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి విస్తృత ప్రచారం



సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న సంగీతారెడ్డి

హుడాకాంప్లెక్స్: బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి డా.సంగీతారెడ్డి గురువారం సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణితో కలిసి వేంకటేశ్వరకాలనీలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలతో చర్చించి వారి అమూల్యమైన ఓటును బీజేపీకి వేసి చేవెళ్ల పార్లమెంటు దేశాభివృద్ధికి చేయూతనివ్వాలని అభ్యర్థించారు.

## ‘మల్కాజిగిరి’లో బీఆర్ఎస్ విజయం ఖాయం: రాగిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వేదికపై ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం కొత్తపేటలోని రాజధాని గార్డెన్స్‌లో నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాతో కలిసి లక్ష్మారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఎంతో బలంగా ఉందని, పార్టీ నుంచి ఎవరు బయటకు వెళ్లినా ఎలాంటి నష్టం లేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.. కరెంట్, మంచినీటి కష్టాలు తెచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి ఎంపీ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించాలని ఆయన సూచించారు. మంచి సేవా గుణమున్న రాగిడి లక్ష్మారెడ్డిని మనంతా కలిసి గెలిపించుకొని కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్ రెడ్డి, బి.వెంకటేశ్వర రావు, డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ పైప్‌లైన్‌పై కారు వెళ్లిందని డ్రైవర్‌పై దాడి

నాగోలు: వాటర్ ప్లాంట్ పైప్‌లైన్‌పై నుంచి కారు వెళ్లిందని కారు నడుపుతున్న వ్యక్తిపై వాటర్ ప్లాంట్ నిర్వాహకులు దాడి చేసి గాయపర్చారు. నాగోలు ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం.. బండ్లగూడ ఆనంద్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉండే ఢిల్లీ ప్రదీప్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం తన కారులో నాగోలు నుంచి ఆనంద్‌నగర్‌కు వస్తున్నాడు. బండ్లగూడ వద్ద రోడ్డు మీద చర్లపల్లి అశోక్‌గౌడ్ వాటర్ ప్లాట్ ఏర్పాటు చేశాడు. కారు నడుపుతున్న ప్రదీప్‌రెడ్డి వాటర్ ప్లాట్ పైప్‌లైన్‌ను గమనించకుండా దానిపై ఎక్కించాడు. పైప్ పగలిపోవడంతో ఆగ్రహానికి గురైన చర్లపల్లి అశోక్‌గౌడ్, అతని కుమారులు క్రాంతిగౌడ్, రాముగౌడ్‌లు కలిసి ప్రదీప్‌రెడ్డిపై దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టారు. స్థానికులు అక్కడికి పెద్ద సంఖ్యలో రావడంతో ప్రదీప్‌రెడ్డిని వదిలేశారు. ఈ మేరకు బాధితుడు బుధవారం రాత్రి నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడ్డ అశోక్‌గౌడ్, క్రాంతిగౌడ్, రాముగౌడ్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డుపై వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన నిర్వాకులపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ‘ఎర్లీబర్డ్’పై ప్రజల ఆసక్తి

- పథకంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ: ఎర్లీబర్డ్ పథకంపై తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గృహ, వాణిజ్య, వ్యాపార యాజమానులు ఎర్లీబర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీ పొందేలా మున్సిపల్ శాఖ ఈనెల 30వరకు అవకాశం కల్పించిన నేపథ్యంలో ప్రజలు ముందుకొస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, ఇమామ్‌గూడ, దేవేందర్‌నగర్ కాలనీ, జిన్నాయిగూడలతో పాటు గ్రేటర్ కమ్యూనిటీ వెంచరుల్లో 6564 గృహాలు, దుకాణాలు ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్ల 13 లక్షలు ఆస్తి పన్ను లక్ష్యంలో 91 శాతం మేరకు మున్సిపల్ సిబ్బంది వసూలు చేశారు.

### ఈ పథకానికి అర్హులెవరంటే?

2023–24 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తులపై ఎలాంటి బకాయిలు లేకుండా పన్ను పూర్తిగా చెల్లించిన వారు ప్రస్తుతం ప్రకటించిన ఎర్లీబర్డ్ పథకానికి అర్హులు. రాయితీ పొందాలనుకునే వారు మార్చి 31 వరకు ఆస్తి పన్ను చెల్లించి.. ఏప్రిల్ 30 వరకు ముందస్తుగా చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. తుక్కుగూడ మున్సిపల్ సిబ్బంది వార్డులు వారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. ఎర్లీబర్డ్ పథకం ప్రారంభమైన మొదటి వారంలోనే 4 శాతం పన్ను వసూలు చేశారు.

## రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 32, బీర 35, క్యాబేజి 21, ఫ్రెంచి బీన్స్ 40, క్యారెట్ 30, దొండ 18, చిక్కుడు 35–50, గోకర 35, బీట్‌రూట్ 21. క్యాప్సికం 60, ఆలు 32, దోస 17, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.



## సీతమ్మకు చేయిస్తున్నారు...చింతాకు పతకం



సీతమ్మకు చేయిస్తున్న చింతాకు పతకాన్ని ప్రదర్శిస్తున్న వానర సేన ప్రతినిధులు

సైదాబాద్: భద్రాచలంలో రామాలయం నిర్మించినప్పుడు అక్కడ కొలువుదీరిన శ్రీరామచంద్ర సమేత సీతమ్మ తల్లికి భక్త రామదాసు చింతాకు పతకం సమర్పించి ధన్యులయ్యారు. అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభమైన తర్వాత మొదటగా వస్తున్న శ్రీరామనవమి నాటికి పలు ఆలయాల్లో కొలువుదీరిన సీతమ్మకు భక్తులు చింతాకు పతకం అందించే సదవకాశాన్ని రాష్ట్రీయ వానరసేన కలిపిస్తోంది. ఈ మహత్కార్యంలో భక్తులు భాగస్వామ్యం కావాలని కోరుతూ వానరసేన ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని శ్రీవిజయ వినాయక ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వానరసేన అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ, భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో చింతాకు పతకాలు తయారు చేయిస్తున్నామని, వాటికి అయోధ్యలోని రామమందిరంలో ప్రత్యేక పూజలు చేయిస్తామన్నారు. ఈనెల 17న నగరానికి చేరుకునే పతకాలను ఎంపిక చేయబడిన చేవెళ్ల, వికారాబాద్, తాండూర్, మహేశ్వరంలోని ప్రాచీన సీతారామ దేవాలయాలకు సమర్పిస్తామన్నారు. అయోధ్య నుంచి నగరానికి రానున్న చింతాకు పతకాల స్వాగత కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శంకరాచారి, మాధవరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

## దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత మోదీదే..

బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల



హయత్‌నగర్‌లో మాట్లాడుతున్న ఈటల

హస్తినాపురం: గతంలో ఏ ప్రధానీ చేయని విధంగా దశాబ్ది కాలంలో దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని టీఎన్ఆర్ సులక్షణ గేటెడ్ కమ్యూనిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డితో కలిసి పాల్గొన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మోదీని మరోసారి ప్రధానిని చేయాలని ఈటల కోరారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేశ్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, మాధవరెడ్డి, చిలుకూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**‘హామీలను దాటవేస్తున్న కాంగ్రెస్’..**

హయత్‌నగర్: అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వాటిని అమలు చేయకుండా దాట వేస్తోందని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విమర్శించారు. గురువారం హయత్‌నగర్ ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన హయత్‌నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఎంపీగా గెలిపించిన రేవంత్‌రెడ్డి మల్కాజిగిరికి చేసిందేమీ లేదన్నారు. మల్కాజిగిరి ఎంపీగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లె నవజీవన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాష తదితరులు పాల్గొన్నారు.

**మూడోసారి మోదీని ప్రధానిని చేయాలి..**

ఎల్‌బీనగర్: దేశం అభివృద్ధి వైపు నడవాలంటే నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా గెలవాలని, వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి తనను గెలిపించాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఎన్‌జీఓ కాలనీ, రాజీవ్ గాంధీ పార్క్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో, హరిహర పురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# జ్యోతిరావుకు ఘన నివాళి

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం : వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి ఆద్యుడు, దళిత బహుజనోద్ధరణ, స్త్రీ విద్య కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక వేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడు. గురువారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎల్బీనగర్/మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన చిత్రాలు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌బీనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్, సామ రంగారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, హస్తినాపురం చౌరస్తాలో జస్టిస్ చంద్రకుమార్ తదితరులు నివాళులర్పించారు.



ఎల్‌బీనగర్‌లో... పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి



ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో పూలే విగ్రహానికి పూలమాలవేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కృష్ణతులసినగర్‌లో.. మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టుపాక ప్రభాకర్



ఎల్‌బీనగర్‌లో.... మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న



హస్తినాపురం చౌరస్తాలో నివాళులర్పిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, చెన్నోజు శ్రీనివాసులు



సరూర్‌నగర్ చౌరస్తాలో.. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తీగల కృష్ణారెడ్డి



కొత్తపేటలో .. కార్పొరేటర్ పవన్‌కుమార్



అల్కాపురి చౌరస్తాలో.. కాంగ్రెస్ నేతలు దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేష్, చిలుక ఉపేందర్‌రెడ్డి



మూసారంబాగ్‌లో.. టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, బోనగిరి చంద్రశేఖర్



నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్